# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 290 స్థానాల్లో విజయం సాధించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని 175 శాసన సభ స్థానాల్లో కూటమి 164 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.**
3. **తెలంగాణలో జరిగిన 17 లోక్‌సభ స్థానాల ఎన్నికల్లో బీజేపీ 8, కాంగ్రెస్ పార్టీ 8 స్థానాల్లో ఎంఐఎం ఒక స్థానంలో విజయం సాధించింది.**
4. **ఈ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**
5. **రుతుపవనాల ప్రభావంతో రానున్న రెండు రోజులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

దేశవ్యాప్తంగా వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 290 స్థానాల్లో విజయం సాధించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హ్యాట్రిక్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌పై ఆయన లక్షా 52 వేల 513 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో నిన్న నిర్వహించిన సంబరాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విజయం 140 కోట్లమంది ప్రజల గెలుపని పేర్కొంటూ......

(వాయిస్ 40 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ కూటమి తిరుగులేని విజయం సాధించింది. 175 స్థానాల్లో పోటీ చేసిన కూటమి.. 164 స్థానాల్లో గెలుపొంది ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తిరుగులేని విజయంతో చరిత్ర సృష్టించింది. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు చిత్తూరు జిల్లా కుప్పంలో 48వేలకు పైగా ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఇక జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో 70 వేల 279 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానం నుంచి 2 లక్షల 39 వేలకు పైగా ఆధిక్యంతో

గెలుపొందారు. కాగా 144 శాసనసభ స్థానాల్లో పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లోను, జనసేన పోటీచేసిన 21 స్థానాల్లోను, బీజేపీ 10 స్థానాలకు గాను 8 స్థానాల్లో విజయం సాధించాయి.

---------------------------

ఎన్నికల్లో తమ కూటమి విజయంపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఆంధ్రప్రదేశ్ గెలిచిందని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు గెలిచారని సామాజిక మాధ్యమ వేదికగా సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ఆశీర్వదించిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి గెలిచామని.. అందరం కలిసే అభివృద్ధి చేస్తామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంతో నిబద్ధతతో ఉన్న పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి అభినందనలు తెలిపారు. కార్యకర్తల కృషితోనే ఇంత పెద్ద విజయం సాధ్యమైందని చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు.

---------------------------

ఎన్నికల్లో విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పరస్పరం అభినందనలు తెలుపుకొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నిన్న చంద్రబాబు నాయుడు ఫోన్ చేశారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకి రాబోతున్నందుకు అభినందనలు తెలిపారు. మోదీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి సాధించిన విజయాలకు చంద్రబాబు నాయుడిని అభినందించారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కూడా ఫోన్‌లో మాట్లాడి, ఎన్నికల్లో విజయం సాధించడంపై అభినందించారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ చంద్రబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, అభినందనలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలైంది. 175 అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఎన్నికల బరిలో దిగిన ఆ పార్టీ 11 స్థానాలకే పరిమితమైంది. మొత్తం 8 ఉమ్మడి జిల్లాల్లో.. వైఎస్సార్సీపీ కనీసం ఖాతా తెరవలేకపోయింది. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో మొత్తం స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డికి ఆధిక్యం గత ఎన్నికల కంటే తగ్గింది. జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారందరూ ఓటమి పాలయ్యారు. కాగా.. కోట్ల మందికి సంక్షేమం అందించినా.. అన్ని వర్గాల మంచి కోసం పరితపించిన తమ ప్రభుత్వానికి ఇలాంటి ఫలితం వస్తుందని ఊహించనే లేదని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమిపై నిన్న ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయని, ఇలాంటి ఫలితాల్ని ఊహించలేదని తెలిపారు.

---------------------------

ఎన్నికల్లో ఓటమి పాలవడంతో వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు నిన్న ఆయన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు రాజీనామా లేఖను పంపారు.

దీనిని గవర్నర్ ఆమోదించారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడేంత వరకు జగన్మోహన్ రెడ్డి పదవిలో కొనసాగాలని సూచించారు.

---------------------------

తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8, బీజేపీ 8 స్థానాల్లో విజయకేతనం ఎగురవేయగా, ఎంఐఎం ఒక స్థానంలో విజయం సాధించింది. భారత రాష్ట్ర సమితి–బిఆర్ఎస్ పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ పరాజయం పాలయ్యింది. ఏకంగా ఏడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ధరావతు కోల్పోయారు. నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్, జహీరాబాద్, పెద్దపల్లి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. హైదరాబాద్ స్థానంలో ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి గెలుపొందారు.

---------------------------

భూమి పునరుద్ధరణ, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఎడారీకరణను ఆపడం, కరువును తట్టుకునే విధంగా భూమిని నిర్మించడం అనే ఇతివృత్తంతో ఈ రోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించవలసిన ఆవశ్యకత పట్ల ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. విచక్షణా రహితంగా అడవుల నరికివేత, వాహనాలను, ప్లాస్టిక్‌ను ఇబ్బడిముబ్బడిగా వినియోగించడం, పంట భూముల్లో ఎరువుల వాడకం, చెట్ల పెంపకం విషయంలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల వాతావరణం కలుషితమై పర్యావరణ సమతూకం దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచి వాహనాలను, విద్యుత్‌ను పరిమితంగా వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, ఈ దిశగా అందరూ ఉద్యమించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. కాగా.... భూ సారాన్ని పెంచేందుకు, కరువు పరిస్థితులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటూ, ఈ దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేస్తోంది.

---------------------------

నైరుతి ఋతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల్లో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

అలాగే నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణ ప్రాంతంలోని నారాయణపేట జిల్లా వరకు విస్తరించినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. నాలుగైదు రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. దక్షిణ కోస్తాంధ్ర నుంచి ఉత్తర తమిళనాడు తీరం వరకు నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో తేలికపాటి వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని చెప్పింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జనసేన విజయం సాధించడం ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షకు ప్రతిరూపమని ఆ పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ అభివర్ణించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కార్యకర్తలనుద్దేశించి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిన్న ఆయన మాట్లాడారు. ఇది కక్ష సాధింపులకు సమయం కాదని.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన పునాదులు వేసే సమయమని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు గుర్తున్నాయని.. వాటిని నరవేర్చేందుకు బాధ్యతగా పనిచేస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

======================